
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 10 ఏప్రిల్ 2024

వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు




లేపాక్షి ఆలయ ముఖ చిత్రం

పైసల్లేని పర్యాటకం!

జిల్లాలో చారిత్రాత్మక సంపదకు కొదువలేదు. శిల్పకళావైభవం, కట్టడాలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు కోకొల్లలు. శిల్పకళల కాణాచి లేపాక్షి, రాయల రెండో రాజధాని పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ అతిథులు విడిదిచేసే వీరాపురం, ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలు బొమ్మలు, తిమ్మమ్మ మర్రిమాను ఇలా చెప్పుకుంటూపోతే జిల్లా అంతటా పర్యాటక, చారిత్రాత్మక సంపద, కళాకృతులు ఉన్నాయి. వీటన్నింటిని అభివృద్ధి చేసి ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు నిధులు కేటాయించి, పర్యాటక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో అన్ని పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. ఆ ప్రతిపాదనను అటకెక్కించింది. ఐదేళ్ల పాలనలో ఒక్క అడుగూ ముందుకు వేయకపోగా.. పర్యాటకాభివృద్ధి కలగానే మిగిలిపోయింది. టీడీపీ హయాంలో చేపట్టిన పనులు, కేటాయింపులే తప్ప.. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కటీ చేపట్టింది లేదు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అన్ని అవకాశాలున్నాయి. పాలకుల చొరవే కరువైంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా చారిత్రాత్మక సంపద మరుగున పడుతోందన్న విమర్శలున్నాయి. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరోసారి ఇది ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. - ఆంధ్రజ్యోతి,పుట్టపర్తి

వారసత్వ సంపద గుర్తింపేదీ?

లేపాక్షి ప్రపంచ ప్రసిద్ధి పొందింది. అలాంటి శిల్పకళా వైభవం కలిగిన లేపాక్షికి వారసత్వ సంపద గుర్తింపు కోసం పురావస్తుశాఖ, స్థానికులు నేటికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల లేపాక్షిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోపాటు జీ-20 దేశాల ప్రతినిధులు సైతం సదర్శించారు. ఇంత ప్రాచుర్యం తీసుకురావడానికి టీడీపీ ప్రభుత్వమే కారణమనడంలో సందేహం లేదు. తొలిసారిగా 2012 సెప్టెంబరు 8, 9 తేదీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం లేపాక్షి ఉత్సవాలను నిర్వహించి, ప్రాచుర్యం తీసుకొచ్చింది. ప్రపంచం దృష్టి ఆకర్షించేలా టీడీపీ హయాంలో 2016 ఫిబ్రవరి 27, 28 తేదీలు, 2018లో మార్చి 31, ఏప్రిల్ 1న లేపాక్షి నంది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పది కోట్లరూపాయలకుపైగా నిధులు విడుదల చేసి, అభివృద్ధి పనులు చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులతోపాటు తెలుగు, కన్నడ రాష్ట్రాల రాజకీయ, సినీ ప్రముఖులు, కళాకారులు, ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ప్రపంచానికి చాటారు. ఏళ్లుగా ప్రతిపాదన దశలో ఉన్న ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రస్తావన ఉత్సవాలతో తెరపైకి తీసుకొచ్చారు. లేపాక్షిని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో లేపాక్షికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తీసుకువచ్చినట్లయింది. రెండేళ్ల కిందట యునెస్కో తాత్కాలిక జాబితాలో లేపాక్షికి చోటు దక్కింది. వైసీపీ అధికారం చేపట్టాక అభివృద్ధి ఊసేలేకుండా పోయింది. పైసా కూడా నిధులు విదల్చలేదు. ఉత్సవాల నిర్వహణను మరిచారు. నిధులివ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.


చెట్టుపై కూర్చున్న విదేశీ పక్షులు

విదేశీ అతిథుల ఆకలి కేకలు

చిలమత్తూరు మండలం వీరాపురం చెరువుకు ఏటా రష్యాలోని సైబీరియా నుంచి పెయింటెడ్ స్టార్క్ పక్షులు (ఎర్రకాళ్ల కొంగలు) వస్తాయి. ఫిబ్రవరి వచ్చిందంటే ఆ పక్షులు వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో విహరిస్తుంటే వాటిని చూసేందుకు పర్యాటకులు విపరీతంగా వస్తారు. సీజన్‌లో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భారీగా పర్యాటకుల రాకతో సందడిగా మారిపోతుంది. రంగురంగుల ఈకలు కలిగిన అందమైన ఈ కొంగజాతి పక్షులు తమ విన్యాసాలతో సందర్శకులకు కనువిందు చేస్తాయి. పర్యాటకులకు సౌకర్యాలతోపాటు వలస పక్షులకు చెట్లపై గూళ్లు, నీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పించాలని టీడీపీ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లగా వీరాపురానికి పైసా నిధులివ్వకపోగా చెరువుల్లో నీరు, ఆహారం లేక అర్ధాకలితో అతిథి పక్షులు అలమటిస్తున్నాయి. పక్షుల రాక తగ్గిపోయి పర్యాటకులకు నిరాశే మిగులుతోంది.


పుట్టపర్తిలో చిత్రావతి నది వద్ద కళావిహీనంగా మారిన పార్కు

పర్యాటక ఆకర్షణేదీ?

జిల్లాలో ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. టీడీపీ హయాంలో పుట్టపర్తి సమీపంలో చిత్రావతి నది పరీవాహక ప్రాంత అభివృద్ధిలో భాగంగా రూ.5 కోట్లకుపైగా నిధులు విడుదల చేసింది. నదిపై చెక్‌డ్యామ్, హారతి ఘాట్, ఇరుపైపులా ఆధునికీకరణ, పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి పనులు చేపట్టారు. బుక్కపట్నం చెరువులో బోటింగ్, ఉద్యానవనాలు, పుట్టపర్తి చుట్టూ రింగురోడ్డు నిర్మాణానికి టీడీపీ హయాంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైసీపీ వచ్చాక.. ఇవన్నీ మూలన పడేసింది. మడకశిర నియోజక వర్గం హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయం, గిన్నీస్‌బుక్ రికార్డులకెక్కిన తిమ్మమ్మ మర్రిమాను, కటారుపల్లి యోగివేమన సమాధి, తోలుబొమ్మల కళకు గుర్తింపు పొందిన నిమ్మలకుంట పర్యాటక ప్రాంతాల వద్ద సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో పర్యాటక శోభను కోల్పోతున్నాయి. జిల్లాలో చారిత్రాత్మక సంపద, కళాకృతులు, మన భాష, సంస్కృతిని తెలిపే శిల్పవైభవం, కట్టడాలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పెనుకొండ కొండపైకి రోడ్డు

రాయల రాజధానిపైనా నిర్లక్ష్యం


రాయల రెండో రాజధానిగా పెనుకొండ ఎంతో చారిత్రక ప్రాశస్త్యాన్ని కలిగి ఉంది. 2010లో శ్రీకృష్ణదేవరాయల పంచమ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అప్పట్లో రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి రోశయ్య, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పర్యాటక, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. పెనుకొండను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కొండపైకి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేశారు. టీడీపీ హయాంలో పర్యాటక అభివృద్ధి పరంపర కొనసాగించారు. శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాల నిర్వహణతోపాటు రాయల కాంస్య విగ్రహ ఏర్పాటుతోపాటు పట్టణంలో సిమెంటు రోడ్ల నిర్మాణం, స్వాగతం ఆర్చి ఏర్పాటు చేశారు. కొండపైకి రోడ్డు నిర్మాణం చేపట్టారు. వైసీపీ వచ్చాకా కొండరోడ్డు కొండ రోడ్డు తుది దశ పనులు మాత్రమే పూర్తి చేసి, వదిలేశారు. టీడీపీ హయాంలోనే ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి ట్రస్టు ముందుకొచ్చింది. అప్పట్లోనే కొండపైకి రోప్‌వే ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. ఐదేళ్లుగా ముందుకు సాగలేదు. కొండపై రూ.500 కోట్లతో లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ ప్రతిపాదన ఉంది. వైసీపీ వచ్చాకా ఇవి ఒక్కటీ అమలుకు నోచుకోలేదు.

మరుగున పడిన టూరిజం సర్క్యూట్

ఉమ్మడి జిల్లాను రెండు ప్రత్యేక పర్యాటక వలయా(సర్క్యూట్)లుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేశాయి. ఇందులో లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, హేమావతి, కటారుపల్లి, వేమన సమాధి, తిమ్మమ్మ మర్రిమాను, విదేశీపక్షుల విడిది వీరాపురం, పట్టుచీరల ధర్మవరం, హిందూపురం వీవర్స్ కాలనీ, తోలుబొమ్మల నిమ్మలకుంట ప్రాంతాలను కలుపుతూ ఓ ప్రత్యేక సర్క్యూట్ చేయాలనే ప్రతిపాదన చేశారు. తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి, పెన్నహోబిలం ఆలయం, గుత్తి, రాయదుర్గం కోటలతోపాటు మరికొన్ని ప్రాంతాలను కలిపి మరో వలయంగా చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. పెనుకొండలో 2010లో నిర్వహించిన కృష్ణదేవరాయల ఉత్సవాల్లో టూరిజం సర్క్యూట్ తెరపైకి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో చారిత్రాత్మక సంపద, కళాకృతులు, శిల్పవైభవం, కట్టడాలు, దేవాలయాలతోపాటు పర్యాటక ప్రాంతాలను టూరిజం సర్క్యూట్‌గా తీసుకువచ్చేందుకు 2016, 2018లో వైభవంగా నిర్వహించిన లేపాక్షి ఉత్సవాల్లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.25కోట్లు వెచ్చిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు ప్రతిపాదనలు సైతం పర్యాటక శాఖ సిద్ధం చేసింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో పర్యాటక సర్క్యూట్ మరుగున పడిపోయింది.




లేపాక్షిలో అర్ధంతరంగా ఆపేసిన కోనేరు పనులు


లేపాక్షిలోని జటాయువు థీమ్ పార్కు


తిమ్మమ్మ మర్రిమాను

ఉషోగ్రతలు (మంగళ)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	38.0	23.0
కదిరి	37.0	23.0
ధర్మవరం	39.0	24.0
హిందూపురం	37.0	23.0
పెనుకొండ	38.0	23.0


ఊరూరా తెలుగు సంబరం


మహాసమాధి వద్ద పూజలు అందుకుంటున్న దుర్గమ్మ

పుట్టపర్తి, ఏప్రిల్ 9: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఊరూరా మంగళవారం సంబరంలా చేసుకున్నారు. ఇంటిల్లిపాదీ నూతన వస్త్రాలు ధరించి, పూజలు చేశారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఊరూరా పంచాంగ శ్రవణం నిర్వహించారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంతులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాసమాధి వద్ద దుర్గాదేవి పూజ చేశారు. సత్యసాయి విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం ప్రముఖ జ్యోతిష్యుడు కేవీకే రాఘవన్ శ్రీక్రోధినామ సంవత్సర పంచాంగ ఫలితాలను వివరించారు. పంచాంగ కర్తను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి సత్కరించారు.


పంచాంగాన్ని పఠిస్తున్న కేవీకే రాఘవన్

సాయంత్రం వైష్ణవి వాగ్దేవి బృందం సంగీత కచేరి నిర్వహించింది. వేడుకల్లో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జేసీ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.


స్వామివారికి ఉయ్యాల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఉపాధికి వడదెబ్బ..!

- తాగునీటికి నోచుకోని దయనీయం
- పనిచేసే ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు కరువు
- వైసీపీ పాలనలో ఊసేలేని వైనం

మండుటెండలో కూలీల పనులు

భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఎండలు మండిపోతున్నాయి. బయటకు వెళ్లాలంటేనే జంకాల్సి వస్తోంది. ఇంత ఎండలోనూ ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. తీవ్ర ఎండలోనే పనులు చేస్తున్నారు. వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నా.. వారికి కష్టం తప్పట్లేదు. అలాంటి వారిపై ప్రభుత్వం కనీస కనికరం చూపట్లేదు. వారు పనిచేసే ప్రదేశాల్లో కల్పించాల్సి ఉన్న సౌకర్యాలను సైతం విస్మరించింది. పని మధ్యలో కాసేపు ఉపశమనం పొందడానికి ఏర్పాటు చేయాల్సిన టెంట్లు కనిపించట్లేదు. అస్వస్థతకు లోనైతే ప్రథమ చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు లేవు. కనీసం తాగు నీరు కూడా ఉండట్లేదు. ఎండాకాలంలో ఈ సౌకర్యాలన్నీ కల్పించాల్సి ఉన్నా.. వైసీపీ పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. తద్వారా ఉపాధి హామీ కూలీల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.



- కొత్తచెరువు

నీటికీ తిప్పలే

మండుతున్న ఎండలకు తగ్గట్టు పనులు చేసే సమయంలో దాహం వేయడం సహజం. శరీరంలో ఉన్ననీరు చెమట రూపంలో బయటకు వెళ్తోంది. దానికితోడు పనిచేసే స్థలాల్లో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఉపాధి కూలీలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఉపాధి కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.5 చొప్పున కూలీ డబ్బుతో కలిపి నీటి చార్జీ చెల్లిస్తోంది. కూలి డబ్బు సకాలంలో అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూలీలు ఇళ్ల నుంచే క్యాన్లలో నీటిని తెచ్చుకుంటున్నా.. అవి అరగంటలోపే ఎండకు వేడెక్కుతున్నాయి. ఆ వేడి నీటినే తాగాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు.

కనిపించని వసతులు

ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశాల్లో తాగేందుకు నీరు కూడా ఉండట్లేదు. మధ్యలో కాసేపు సేద తీర్చుకోవడానికి టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఎండలో అస్వస్థతకు లోనైనా, ప్రమాదం బారిన పడినా ప్రథమ చికిత్స చేయడానికి కిట్లు సైతం లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో పనిచేసే ఉపాధి కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూలీలు అసౌకర్యాల నడుమ పనులు చేస్తున్నారు. వేసవి కావడంతో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు.


ఎండలోనే ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పనులు లేక..

ప్రస్తుతం వ్యవసాయ పనుల్లేవు. ఇతర కూలి పనులు కూడా దొరకట్లేదు. దీంతో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి హామీ పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. పనికెళ్తే ఎండకు విలవిల్లాడుతున్నారు. కనీస సౌకర్యాలు కరువవడంతో వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని కూలీలు వాపోతున్నారు.

టెంట్లు ఎత్తేశారు..

ఉపాధి కూలీలు పనిచేసే చోట నీడ కల్పించాలన్న ఉద్దేశంతో టీడీపీ హయాంలో జిల్లాకు వేలాది సంఖ్యలో టెంట్లు అందజేశారు. వైసీపీ పాలనలో ఒక్క టెంటు కూడా రాలేదు. దీంతో పనిచేసే ప్రాంతాల్లో చెట్లకింద సేద తీరుతున్నారు. కొన్నిచోట్ల చెట్లు లేకపోవడంతో ఇంటి నుంచే దుప్పట్లు, ఇతర టార్పాలిన్ పట్టలను తీసుకెళ్తున్నామని పలువురు కూలీలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 59వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. టెంట్లు లేకపోవడంతో కూలీలు పనులను త్వరగా ముగించుకుని ఇంటిబాట పడుతున్నారు.

జాడలేని మెడికల్ కిట్లు

పనిచేసే చోట్ల ఉపాధి కూలీలు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. వెంటనే ప్రథమ చికిత్స అందించాలంటే మెడికల్ కిట్లు అవసరం. ప్రస్తుతం కిట్లు అందుబాటులో ఉంచట్లేదు. ప్రస్తుతం ఎండ తీవ్రతకు పలుచోట్ల కూలీలు సొమ్మసిల్లి పడిపోతున్నారు. దీంతో ఉపాధి సిబ్బంది.. ఆ కూలీలకు నీరు తాగించి ఇంటికి పంపుతున్నారు. నాలుగేళ్ల క్రితం అందజేసిన కిట్లన్నీ ప్రస్తుతం మాయమయ్యాయని సాక్ష్యాత్తు ఉపాధి సిబ్బందే చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రథమ చికిత్స బాక్సులు అవసరం ఎంతైనా ఉందని కూలీలు తెలియజేస్తున్నారు.

కేంద్రానికి నివేదించాం

జిల్లాకు నాలుగేళ్ల క్రితం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు సరఫరా అయ్యాయి. ఆ తరువాత సరఫరా ఆగిపోయింది. ప్రస్తుతం పలు చోట్ల మాత్రమే టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఉన్నాయి. ఎండలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు అవసరమైన వసతుల గురించి కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు నివేదించాం. త్వరలో సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాం. స్థానిక పీహెచ్‌సీల నుంచి ప్రథమ చికిత్స మందులను ఉపాధి సిబ్బంది ద్వారా అందజేస్తున్నాం.

- విజయప్రసాద్, డ్వామా పీడీ

ఖాద్రీశుడికి ఉయ్యాల సేవ


కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారికి ఉయ్యాల సేవ నిర్వహించారు. అంతకుముందు అర్చకులు, వేదపండితులు శ్రీక్రోధినామ సంవత్సరం పంచాగ శ్రవణం చేశారు. తరువాత స్వామివారికి ఉయ్యాల సేవ నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి, ఉయ్యాలలో ఆస్థానం చేసి, శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉత్సవం నిర్వహించారు.

ఇఫ్తార్



రంజాన్ వేళలు

పుట్టపర్తి	6.36 బుధవారం (సాయంత్రం)
కదిరి	6.33 బుధవారం (సాయంత్రం)
ధర్మవరం	6.38 బుధవారం (సాయంత్రం)
హిందూపురం	6.36 బుధవారం (సాయంత్రం)
పెనుకొండ	6.34 బుధవారం (సాయంత్రం)



సరెండర్ సెలవుల సంకటం..!

ఈఎల్స్‌ను సరెండర్ చేసిన టీచర్లు.. ఒక్కొక్కరికి లక్షలాది రూపాయలు పెండింగ్





ఎర్రగుంట హైస్కూల్‌లో పనిచేసే ఓ స్కూల్ అసిస్టెంట్ 2023లో ప్రమోషన్‌కు మరో స్కూల్‌కు వెళ్లాడు. ఆయన గతంలో నార్పలలో పనిచేయగా.... నవంబరు 2022లో ఈఎల్స్‌ను సరెండర్ చేశారు. ఇప్పటి వరకూ ఆయనకు డబ్బు జమ కాలేదు. దర్గాహోన్నూరు, నెరమెట్ల తదితర స్కూళ్లలో పనిచేసే పలువురు టీచర్లకు రెండేళ్లుగా సరెండర్ సెలవుల డబ్బు జమకాలేదు.

జిల్లాలోని బొమ్మనహాళ్, డీ హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, కంబదూరు ఇలా అనేక మండలాల్లోని వేలాది మంది ఉపాధ్యాయులు అప్లై చేసినా సరెండర్ సెలవుల డబ్బు రెండు, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంది.

అనంతపురం విద్య, ఏప్రిల్ 9 : జగన్ ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ముందు చూస్తే నుయ్యి... వెనుక చూస్తే... గొయ్యి అన్న చందంగా మారింది. సరెండర్ సెలవులకు సంబంధించిన డబ్బు అటు ఖాతాలకు జమ కాక.. ఇటు వాడుకోడానికి వీల్లేకుండా పోయింది. వేలాది మంది ఉపాధ్యాయులు తమ హక్కుగా భావించే సరెండర్ లీవ్స్ డబ్బుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. కొందరికి రెండేళ్లుగా... మరికొందరికి మూడేళ్లుగా డబ్బులు జమ కావడం లేదు. దీంతో చాలా మంది ఇప్పటికే అప్లై చేసిన సరెండర్ సెలవులపై ఆశలు వదులుకున్నారు. ఆఖరికి సరెండ్ సెలవుల అప్లై చేయడమే ఈ ప్రభుత్వంలో దండగా అంటూ ఉపాధ్యాయులు నిట్టూరుస్తున్నారు.

ఎప్పుడిస్తారో....?

ఉపాధ్యాయులకు, ఇతర శాఖల ఉద్యోగులతో పోలిస్తే... సంపాదిత సెలవులు చాలా తక్కువ. వెకేషన్ డిపార్టుమెంట్‌కు చెందిన టీచర్లకు ఏడాదికి ఆరు రోజుల సెలవులు ఇస్తే... నాన్ వెకేషన్ డిపార్టుమెంట్ ఉద్యోగులకు ఏడాదికి 30 వరకూ వస్తాయి. జిల్లా వ్యాప్తంగా రెండు డివిజన్లలో 1659 ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 8,643 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్, మున్సిపల్ ఇతర ప్రభుత్వ రంగ యాజమాన్యాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఏడాదికు సుమారు 6 వరకూ ఈఎల్స్ వస్తాయి. ఉపాధ్యాయులకు జమ అయిన సెలవులను ప్రభుత్వానికి సరెండర్ చేయడం ద్వారా ప్రభుత్వం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రభుత్వం వచ్చాక... చాలా మంది ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం సరెండర్ సెలవులు అప్లై చేశారు. కొందరు 15 రోజుల, మరికొందరు 30 రోజులను అప్లై చేశారు. అయితే ఉపాధ్యాయులు అప్లై చేసిన సరెండర్ సెలవుల డబ్బులు నేటికీ పడలేదు.



వేలాది మంది ఉపాధ్యాయులకు రెండేళ్లు, మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. వందల కోట్ల రూపాయలు సరెండర్ సెలవులు డబ్బులను జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. దీంతో అటు సరెండర్ సెలవుల డబ్బులు జమ కావడం లేదు. మరోవైపు...ఆ సెలవులు సర్వీస్ రిజిస్టర్‌లో రికార్డు కావడంతో... వాటిని వాడుకోడానికి వీలులేక ఆ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అవసరాలకు అప్లై చేస్తే.. డబ్బులు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఆఖరికి ఉపాధ్యాయులు చేతిలో ఉన్న ఈఎల్స్‌ను సరెండర్ చేయడానికి కూడా వెనకాడుతున్నారు. అప్లై చేస్తే... డబ్బులు పడవని, పైగా వాటిని వాడుకోడానికి కూడా అవకాశం లేకుండా పోతోందని, ఈ ప్రభుత్వంలో సరెండర్ సెలవుల జోలికే వెళ్లకపోవడం మేలు అంటూ... ఉపాధ్యాయులు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెలవులు ఎన్‌క్యాష్ కావడం లేదు



ప్రతినెలా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికే ప్రభుత్వం ఇబ్బందులు పడుతోంది. టీచర్లు, ఉద్యోగులకు గతంలో సరెండర్ సెలవులు అప్లై చేస్తే... పూర్తిస్థాయిలో పడేది. ఇప్పుడు రెండేళ్లు, మూడేళ్లుగా చెల్లింపులు కావడం లేదు. దీంతో జీతం వస్తే చాలు అనేస్థాయికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు వెళ్లారు. గతంలో సరెండర్ లీవ్స్ పెట్టిన బిల్లులకు ఇప్పటి వరకూ జమ కావడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యలు గుర్తించి చెల్లింపులు చేయాలి.

- రవీంద్ర, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం సుమారు రెండు, మూడేళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరెండర్ సెలవుల డబ్బులు జమ చేయడం లేదు. జిల్లాలో వందలాది మంది ఉపాధ్యాయులు ఈఎల్స్ క్లైమ్ చేశారు. కానీ డబ్బుల కోసం ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం డబ్బులను ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలి

- గోవింద్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రెండు, మూడేళ్లుగా బిల్స్ పెండింగ్...



చాలా మంది ఉపాధ్యాయులు ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు బదిలీ అయ్యారు. వారి కేడర్ మారింది. గతంలో ఎస్‌జీటీలగా ఉన్న వాళ్లు ప్రమోషన్లపై స్కూల్ అసిస్టెంట్లు అయ్యారు. అప్పట్లో అప్లై చేసిన వాళ్లకు ఇప్పటి వరకూ డబ్బులు జమ కాలేదు. రెండు, మూడేళ్లుగా బిల్స్ పెండింగ్‌లో ఉంచడం సరికాదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

- విజయభాస్కర్, ఏపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు

ఎన్నికల ప్రచారంలోకి బాలయ్య

12న కదిరిలో సైకిల్ రావాలి యాత్ర



పుట్టపర్తి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 'సైకిల్ రావాలి' యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 12న కదిరిలో సైకిల్ రావాలి యాత్ర ప్రారంభిస్తారు. అదేరోజు మధ్యాహ్నం పుట్టపర్తిలో, సాయంత్రం అనంతపురం నగరంలో రోడ్‌షో చేయనున్నారు. బహిరంగ సభల్లో ప్రసంగించి శింగనమలలో బస చేస్తారు. రెండో రోజూ శింగనమల, తాడిపత్రిలో యాత్ర కొనసాగిస్తారు. అక్కడి నుంచి నంద్యాల జిల్లాలోకి ప్రవేశించి, బనగానపల్లెలో బస చేస్తారు. సైకిల్ యాత్రలో రోడ్‌షోతోపాటు బహిరంగ సభల్లో ప్రసంగిస్తారని టీడీపీ వర్గాలు తెలిపారు.

స్టాక్‌పాయింట్‌లో అగ్ని ప్రమాదం

150 బస్తాల సబ్సిడీ బియ్యం దగ్ధం

బుక్కపట్నం, ఏప్రిల్ 9: స్థానిక కోటవీధిలోని పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్‌లో మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయి. 150 బస్తాల బియ్యం కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. స్టాక్‌పాయింట్ నుంచి బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాలకు పీడీఎఫ్ బియ్యం సరఫరా చేస్తారు. మంగళవారం రాత్రి స్టాక్‌పాయింట్‌కు ఒక వైపు నిప్పు అంటుకుంది. దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి, బుక్కపట్నం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సురేష్‌బాబు.. సిబ్బందితో గోడౌన్ వద్దకు చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. గోడౌన్‌కు ఒక వైపు షట్టర్ వద్ద కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, అగ్గిపెట్టెలు కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయా, ఎవరైనా అంటించారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్డీఓ, డీఎస్పీ పరిశీలన

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గోడౌన్‌ను పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాగిరి రామయ్య పరిశీలించారు. ప్రమాదంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, నిజాలను నిగ్గు తేలుస్తామని డీఎస్పీ తెలిపారు.



కాలిపోయిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

రాజీనామాల వెనుక..!

వలంటీర్లపై వైసీపీ కుతంత్రాలు

ప్రచారాస్త్రాలుగా వినియోగించుకునే ఎత్తుగడ

రాజీనామా చేయించి రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు

వైసీపీ నాయకులే జీతాలు చెల్లించేలా ఒప్పందాలు?



కొత్తచెరువు ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు (ఫైల్)

ధర్మవరం, ఏప్రిల్ 9: వలంటీర్లపై వైసీపీ కుతంత్రాలు పన్నుతోందా... వారిని పావులా వాడుకునే ఎత్తుగడ వేస్తోందా.. అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే వారితో రాజీనామాలు చేయిస్తున్నారని తెలుస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు సాక్ష్యాత్తు సీఎం జగన్ సైతం 'రాజీనామాలు చేయండి.. ఎన్నికల్లో గెలిస్తే మీకు మొదటి ప్రాధాన్యత ఇస్తాను'టూ బహిరంగ సభలు, సమావేశాల్లో పేర్కొనడం గర్హనీయం. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను వినియోగించుకుని ప్రజలకు సంబంధించిన పూర్తి సమాచారాన్నివారి ద్వారా సేకరించారు. ఎవరు ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నారో, అధికార పార్టీతో లబ్ధిపొందుతున్న ప్రజల్లో పార్టీ పట్ల ఎలాంటి సానుభూతి ఉందన్న అంశాలను సైతం ఇప్పటికే ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు సేకరించినట్లు సమాచారం. అధికార పార్టీ పెద్దలు రానున్న ఎన్నికల్లో ఎలాగైనా వలంటీర్లను ఉపయోగించుకోవాలని ఎత్తుగడ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వారికి తాయిళాలను సైతం అందించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వోద్యోగులు, వలంటీర్లు, చౌకధాన్యపు డిపో డీలర్లు, ఇతర ఉద్యోగులు పాల్గొనరాదని ఎన్నికల సంఘం ఆదేశించినా.. వాటిని బేఖాతరు చేస్తూ అధికార పార్టీ నాయకులు నిర్వహించే ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో ఎన్నికల సంఘం, అధికారులు సీరియస్‌గా తీసుకుని, వారిపై వేటు వేస్తున్నారు. అయినా గుట్టుగా పాల్గొంటూ ప్రచారాలు సైతం చేస్తుండడం శోచనీయం.

రాజీనామాలు చేయండి...

శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటికే వలంటీర్లు.. అధికార పార్టీ నాయకుల ప్రచారాల్లో కార్యకర్తల్లా పాల్గొంటున్నారు. పరోక్షంగా పథకాల పేరుతో ప్రజలను ప్రలోభాలకు లోను చేస్తున్నారు. వారు విధుల్లో ఉండి ప్రచారం చేయడం నియమావళికి విరుద్ధం కావడంతో వైసీపీ కొత్త వ్యూహం తెరపైకి తీసుకొచ్చింది. వలంటీర్లతో రాజీనామా చేయించి, ఎన్నికల ప్రచార రంగంలోకి దింపేందుకు ఏర్పాట్లను చేసుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా నెలజీతం తామే ఇస్తామనీ, ప్రచారంలో పాల్గొనాలంటూ ప్రభుత్వ పెద్దలు సూచించినట్లు తెలుస్తోంది. జిల్లాలో 5 వేలకు పైగా వలంటీర్లు పనిచేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వపెద్దల ఆదేశాలతో సగంమందికిపైగా వలంటీర్లు రాజీనామాలు చేసి, రాజకీయ ప్రచారంలో పాల్గొంటున్నారు. మిగిలిన వారు కూడా త్వరలో రాజీనామాలు చేయనున్నట్లు సమాచారం.

ఓటర్లను ప్రలోభపెడుతూ..

చాలాచోట్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లు.. వృద్ధులు, దివ్యాంగులకు వచ్చేది వైసీపీ ప్రభుత్వమేననీ, పార్టీకి ఓటు వేయకపోతే తామే వలంటీర్లుగా ఉంటామనీ, పింఛన్‌తోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను రాకుండా చేస్తామని బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం.

పోలింగ్ ఏజెంట్లుగా..

ఎన్నికల సంఘం.. వలంటీర్లను రాజకీయంగా వాడుకోకూడదని ఆదేశాలు జారీ చేసింది. సీఎం జగన్.. వలంటీర్లను రాష్ట్ర వ్యాప్తంగా రాజీనామాలు చేయించి, వారికి వార్డుల్లో రాజకీయ బాధ్యతలు అప్పజెప్పనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. వారిని పోలింగ్ ఏజెంట్లుగా వినియోగించుకోవడం ద్వారా ఆ వార్డుల్లో ప్రజలు ఎవరు, ఏ పార్టీకి ఓటు వేస్తున్నారోనన్న దానిపై నిఘా ఉంచవచ్చన్న ఆలోచనలో వైసీపీ పెద్దలు ఉన్నట్లు సమాచారం.

ఉపాధి నిధులు స్వాహా?

అధికారపార్టీ నేతల కనుసన్నల్లో మస్టర్లు

బోగస్ హాజరు ద్వారా రూ.10కోట్ల నిధుల మేత?


ఈ ఏడాది కూలీలకు తగ్గిన పనిదినాలు

రోజుకు 8 వేలే నమోదు



ఎండలోనే పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9: జిల్లాలో ఉపాధి కూలీల నిధులు స్వాహా చేశారు. అధికార పార్టీ నేతలతో కలిసి అధికారులు, సిబ్బంది కోట్ల మేర నిధులను కాజేశారు. నకిలీ రికార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్ము కొల్లగొట్టారు. ఇందుకు ఉపాధి సిబ్బంది సైతం ఇతోధికంగా సహకరించడం గమనార్హం. ఉపాధి కూలీల హాజరు నమోదుకు సంబంధించి బోగస్ మస్టర్లు కూడా అధికార పార్టీ నేతల ఇళ్లలో వేసినట్లు సమాచారం. కాగా వేసవి సీజన్ ప్రారంభమైనా రోజుకు 8వేల పనిదినాలు మాత్రమే నమోదవుతున్నాయి. ఇందులోనూ సుమారు 5వేల వరకు బోగస్ మస్టర్లుగానే ఉన్నట్లు సమాచారం. గతేడాది ఇదే సమయానికి 30వేల వరకు సగటున పని దినాలు నమోదు చేశారు. మరి గతేడాదికి ఈ ఏడాదికి ఇంత తేడా ఎందుకొచ్చిందో అధికారులకే తెలియాలి.



ద్వామా కార్యాలయం

శింగనమలలో నిధుల స్వాహా.. ఓ ఉదాహరణ

శింగనమలలో ఉపాధి నిధుల స్వాహా వెలుగు చూసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి స్వయాన మామ అయిన డీసీఎంఎస్ డైరెక్టర్, శింగనమల సహకార సొసైటీ అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి పేరుతో రూ.7లక్షలు వరకు ఉపాధి నిధులు కాజేశారు. జాబ్‌కార్డు నంబరు 1217111130 16020184తో సీసీ రోడ్డు నిర్మాణం, ఉపాధి పథకంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా 7ఎకరాల్లో చీనీ సాగు చేసినట్లు నిధులు డ్రా చేశారు. ఇలా సీసీ రోడ్డు, మొక్కలు నాటడం, తప్పుడు మస్టర్ల ద్వారా సుమారు రూ.7లక్షలు వరకు నిధులు కాజేశారు. ఇదిలా ఉంటే అధికారపార్టీ నేతల ఇళ్లలోనే ఉపాధి కూలీల బోగస్ మస్టర్లు వేసి నిధులు కాజేయడం పనిగా పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు నడుస్తోంది. ఇందుకు ఉపాధి ఏపీఓలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు సహకరిస్తుండడం గమనార్హం. పైగా తమకు సహకరించకుంటే మీ ఉద్యోగులు ఊడతాయంటూ ఉపాధి సిబ్బందికి అధికారపార్టీ నేతలు హెచ్చరికలు చేస్తుండడం ఆందోళన కలిగించే అంశం. జిల్లా వ్యాప్తంగా బోగస్ మస్టర్ల ద్వారా ఈ ఏడాది రూ.10 కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది.

పడిపోయిన ఉపాధి పనిదినాలు

ఉపాధి కూలీలకు వేసవి సీజన్ ప్రారంభమైంది. అయినా దినసరి కూలీల పనిదినాలు పెరగడం లేదు. ఈ సమయంలో గతేడాది 30వేలకు పైగా పనిదినాలు నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది 8వేలు మాత్రమే నమోదు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో డ్వామా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఈ గణాంకాలే చెబుతున్నాయి. ఇలా నిర్లక్ష్యంగా ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించకపోతే పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం లేకపోలేదు.

పేదల సొమ్ము రికవరీ చేయాల్సిందే



కూలీల పేరుతో స్వాహా చేసిన పేదల సొమ్మును రికవరీ చేయాల్సిందే. అంతేగాక వైసీపీ నాయకులతో కలిసి బోగస్ మస్టర్లు నమోదు చేసిన ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి. తప్పుడు పనిదినాలతో పేదలకు అందాల్సిన సొమ్మును పెద్దలు దోచేయడం దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

- కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు

పని దినాలు పెంచాలి



జిల్లాలో ఉన్న ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచాలి. వేసవిలో రోజుకు కనీసం 30వేల పని దినాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పని అడిగిన కూలీలకు పని చూపించడం లేదు. దీంతో స్థానికంగా పనులు లేక గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌కార్డు కలిగిన అర్హులైన అసలైన కూలీలు ఉపాధి కోసం పట్టణాలకు వలసబాట పడుతున్నారు. అయినా డ్వామా అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ఏమి పట్టించుకోవడం లేదు.

- నాగరాజు, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు

జాబ్‌కార్డు కలిగిన కూలీలకే పనులు



జాబ్‌కార్డు కలిగిన కూలీలకే ఉపాధి పనులు కల్పిస్తున్నాం. ఉపాధి నిధులు కూలీల బ్యాంకు అకౌంట్లలోకి ఆన్‌లైన్‌లో వేస్తున్నాం. ఇక ఎక్కడా ఉపాధి కూలీల సొమ్ము పక్కకు పోయేందుకు అవకాశమే లేదు. ఎక్కడైనా అలా అర్హత లేని జాబ్‌కార్డు కలిగి ఉండి నిధులు డ్రా చేసినట్లు జరిగితే, సామాజిక తనిఖీల ద్వారా గుర్తించి ఆ సొమ్మును సంబంధిత సిబ్బంది ద్వారా రికవరీ చేస్తాం. అంతేగాక అటువంటి సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. వేసవి సీజన్‌లో కూలీలు పని అడిగిన ప్రతిచోట ఉపాధి పనులు కల్పిస్తున్నాం.

- వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ

మేము మారం..

పుట్టపర్తి, ఏప్రిల్ 9: ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఉద్యోగులు మేము మారమంటూ వైసీపీ కార్యక్రమాల్లో యథేచ్ఛగా పాల్గొంటున్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కొంతమంది ఆ పార్టీలో చేరారు. నల్లమాడ మండలం తిప్పయ్యగారిపల్లిలో వెలుగు యానిమేటర్‌గా పనిచేస్తున్న హరినాథరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఉద్యోగాల నుంచి తొలగించినా వారిలో మార్పు రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వైసీపీ కార్యక్రమంలో యానిమేటర్ హరినాథరెడ్డి (వృత్తంలో..)

ఎమ్మెల్యే దుద్దుకుంటపై కేసు నమోదు చేయాలి

● సత్యసాయి తాగునీటి దుర్వినియోగంపై మాజీ మంత్రి పల్లె ఆగ్రహం

పుట్టపర్తి, ఏప్రిల్ 9: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దొంగచాటుగా సత్యసాయి నీటిని తోటకు మళ్లించుకోవడంపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నల్లమాడ, ఓడీసీ, అమడగూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి వాటర్‌ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజల నీటిని దొంగచాటుగా తన తోటకు పైపులైన్ ద్వారా మళ్లించుకున్నారని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దుద్దుకుంట పౌండేషన్ ద్వారా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నానని గొప్పలు చెప్పుకుంటూ మరో పక్క ఏకంగా సత్యసాయినీటి చౌర్యానికి పాల్పడటం ఆయన దోపిడీకి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వాల్టా యాక్టు కింద కేసు నమోదు చేసుకుని ఇందులో భాగస్వాములైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. 190 చెరువులకు నీరు అందిస్తానని చెప్పుకుంటున్న ఘనుడు సామాన్యులకు ద్రోహం చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారుల దృష్టికి ఫిర్యాదు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ఘనంగా ఉగాది



ధర్మవరం చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) తెలుగువారి తొలి పండుగ.. ఉగాది. క్రోది నామ సంవత్సరాన్ని ఘనంగా జరుపుకున్నారు. చైత్రశుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఉగాదిని ప్రజలు భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి, పచ్చని తోరణాలతో ఇళ్లను అలంకరించుకుని ప్రత్యేక వంటకాలతో పండగ జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, చేపట్టారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని ఆరగించి ఇష్ట దైవాన్ని పూజించారు.



పుట్టపర్తి కలెక్టరేట్‌లో పూజలు నిర్వహిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్ దంపతులు




అలంకరణలో చిగిచెర్ల హనుమంతుడు



నంబులపూలకుంటలో ఎల్లమ్మ మూలవిరాట్టు



తనకల్లులో అలంకరించిన జోడుగుండ్ల గంగమ్మ



నల్లచెరువులో రేణుకాయల్లమ్మ



ఓడీసీలో ఓబులమ్మ, ఓబులప్పను ఊరేగిస్తున్న భక్తులు





తుంపర్తిలో ప్రత్యేక పూజలో లక్ష్మీనరసింహస్వామి, పంజుశ్యావాతో పూజారి

కన్నుల పండువగా నెట్టికంటి గ్రామోత్సవం



గుంతకల్లు, ఏప్రిల్9: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి దేవస్థానంలో స్వామివార్ల గ్రామోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు సుప్రభాతసేవ, మహాభిషేకం, స్వర్ణకవచాలంకరణ, పుష్పాలంకరణ, ప్రాతఃకాల అర్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుందరకాండ, వేద పారాయణాలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం పంచాంగ శ్రవణం అనంతరం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గరుడ వాహనంపై ఆశీనులను గావించి, అలంకారాలు చేశారు. ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

ఘనంగా ఫెర్రర్ జయంతి



నల్లమాడలో ఫెర్రర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

నల్లమాడ, ఏప్రిల్ 9: మండలకేంద్రంలోని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆర్‌డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. నల్లమాడ బిసి హాస్టల్ సమీపంలోని ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వానికి నిదర్శనం ఫెర్రర్ అన్నారు. ఈకార్యక్రమంలో బుట్టి నాగభూషణనాయుడు, శ్రీనివాసులు, గంగరాజు, శ్యామలమ్మ, గంగులమ్మ, అరవిందు, శ్రీనాథ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవికుమార్, మహేంద్రనాయక్, శంకర్ తదితరులున్నారు. నారా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రి కావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మండలంలోని రెడ్డిపల్లి సమీపంలో వెలసిన పాలేటి గంగమ్మకు పూజలు చేశారు.

ముదిగుబ్బ : మండల పరిధిలోని గుడ్డంపల్లి తండాలో ఆర్డీటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. తండాలో ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి ఫాదర్ ఫెర్రర్ అని కొనియాడారు.

బత్తలపల్లి : మండలవ్యాప్తంగా ఫాదర్ ఫాదర్ విన్సెంట్ ఫెరర్ 104వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఆర్‌డిటి సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన హుండీలను ఆర్డీ ప్రమీల ఆధ్వర్యంలో లెక్కించారు. 1099హుండిలకు గాను ఆరు లక్షల డబ్బును ఆర్డీ ప్రమీలకు అందించారు. కార్యక్రమంలో ఏటీ యల్ రుక్కుమాంగదా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి

● టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ



పుట్టపర్తి రూరల్, ఏప్రెల్ 9: రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే వైసీపీ సోషల్ మీడియా అసత్యప్రచారాలు చేస్తోందని తెలుగుదేశంపార్టీ ముస్లింమైనారిటీ విభాగపు రాష్ట్రకార్యదర్శి షేక్ మహమ్మద్‌రఫీ మండిపడ్డారు. మంగళవారం ఆయన జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ సోషియల్ మీడియాలో బీజేపీ రాజమండ్రి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ఫొటోను పెట్టి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింలకు ఉన్న 4శాతం రిజర్వేషన్లు తీసివేస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. మైనార్టీలకు పలు సంక్షేమ పథకాలతో మేలు చేసింది టీడీపీనే అని ప్రశంసించారు. ఎన్ని అసత్యప్రచారాలు చేసినా ముస్లింలు ఇలాంటి చౌకబారు ప్రచారాలు నమ్మరని తెలుగుదేశంపార్టీతోనే మైనారిటీలు నడుస్తారని ఆయన పేర్కొన్నారు.

భైరాగి స్వామికి ప్రత్యేక పూజలు

తనకల్లు, ఏప్రిల్ 9: మండలంలోని కనసానివారిపల్లి సమీపంలో భైరాగి గుట్టవద్ద వెలసిన భైరాగిస్వామి ఆలయంలో లోకాయుక్త న్యాయమూర్తి లక్ష్మణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా న్యాయమూర్తి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తాము ఆలయాన్ని నిర్మించుకున్నామని, ఇది ప్రభుత్వ భూమి అయినప్పటికి ఆలయానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన న్యాయమూర్తి రెవెన్యూ అధికారులతో చర్చించి, న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు ఆలయ కమిటీ సభ్యులు క్రిష్టారెడ్డి, టీడీపీ నాయకులు బాగేపల్లి చలపతి, అన్నమయ్య జిల్లా కురాలపల్లికి చెందిన సిదార్థ, పలువురు భక్తులున్నారు.



ప్రత్యేక పూజల్లో లోకాయుక్త న్యాయమూర్తి లక్ష్మణరెడ్డి

మైనార్టీలకు అండగా ఎన్డీయే కూటమి

● బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 9: ముస్లీం మైనార్టీలకు ఎన్డీఏ కూటమి అండగా ఉంటుందని ఎన్డీఏ ఉమ్మడి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకేపార్థసారథి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి టీడీపీ కార్యాలయంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. టీడీపీ తోనే మైనార్టీలకు భద్రత సాధ్యమని వెల్లడించారు. పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



మైనార్టీ నాయకులతో సత్యకుమార్, పరిటాల శ్రీరామ్



పట్టుబడిన మద్యంతో పోలీసులు

అక్రమ మద్యం పట్టివేత

నల్లచెరువు, ఏప్రిల్ 9: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్ఐ కెఎం. లింగన్న తెలిపారు. మండలకేంద్రంలోని కదిరి, మదనపల్లి రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా తనకల్లు నుంచి వచ్చిన నల్లరంగు కలిగిన స్కార్పియోలో 80 హైవార్డ్స్ విస్కీ 90 ఎంఎల్, ఓల్డుఅడ్మిరల్ మూడు ఫుల్ బాటిల్స్ సీజ్ చేశామన్నారు. వాహన డ్రైవర్ ఎన్‌పీకుంట మండలం ఎదురుదొన్నకు చెందిన ఈశ్వరయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

కదిరిఅర్బన్, ఏప్రిల్ 9: మండలపరిధిలోని కౌలేపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఇద్దరు జూదరులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ మోహన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జూదం ఆడుతు న్నారన్న సమాచారం తెలుసుకుని రూ.4000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

నేడు ప్రచారం

గాండ్లపెంట, ఏప్రిల్ 9: మండల పరిధిలోని సోమయాజులపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కొండయ్య పేర్కొన్నారు. బుధవారం కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. ఈప్రచారంలో మండలంలోని టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలని కోరారు.

నేడు ఉపాధ్యాయుల సమావేశం

కొత్తచెరువు, ఏప్రిల్ 9: ఎన్నికల విధుల నుంచి మినహాయింపు పొందిన ఉపాధ్యాయులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి మంగళవారం ప్రకటించారు. కలెక్టర్ కార్యాలయంలో హాజరై సంబంధిత వైద్యుల చేత మినహాయింపు పొందాలన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే వారు కూడా ఉదయం 10.30 గంటలకు జిల్లాకలెక్టర్‌కు రావాలని ఆమె సూచించారు. హాజరు కాకపోతే ఎన్నికల ఆర్డర్ కాపీ పంపడం జరుగుతుందన్నారు.

దాహం తీర్చని చలివేంద్రాలు

● యంత్రాంగం నిర్లక్ష్యంతో ప్రజలకు తప్పని తిప్పలు ● దాతలు ఏర్పాటు చేసినవే దిక్కు



బాలికల పాఠశాల వద్ద దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రం





కోనేరు, ఎంజీరోడ్డు వద్ద దిష్టిబొమ్మల్లా చలివేంద్రాలు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 9: ఎండలు మండుతున్నాయి, రోజురోజుకు పగటి ఉష్ణోగ్రత్తలు పెరుగుతున్నాయి. ఉదయం 10గంటలనుంచే అధిక భానుడు భగభగ మండిపోతున్నాడు. పలు అవసరాల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలకు దాహం కేకలు తప్పడం లేదు. అయితే ప్రజల దాహం తీర్చడంలో అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాస్తవానికి పట్టణంలో ప్రధాన కూడలిల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రతి చలివేంద్రం వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు చేసి, శుద్ది నీటిని అందుబాటులో ఉంచాలి. అయితే అధికారులు రికార్డుల్లో మాత్రం చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రాసుకుంటూ, రూ.వేలల్లో బిల్లులు చేసుకుని జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కదిరి పట్టణంలో 11చోట్ల చలివేంద్రాలు చేశామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే రెండు, మూడుచోట్ల మినహాయించి, మిగిలిన ప్రాంతాల్లో నామమాత్రంగా రెండురోజులు ట్యాంక్ నీరు అందుబాటులో ఉంచి చేతులు దులుపుకున్నారు.

టీడీపీ హయాంలో..

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని టీడీపీ హయాంలో ఏప్రిల్ నుంచి జూన్ నెలవరకు మూడునెలలపాటు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. టీడీపీ పాలనలో గ్రామ, పట్టణాలుఅనే తేడాలేకుండా చలివేంద్రాలు ఏర్పాటుచేసి, నిత్యం నీటిని అందుబాటులో ఉంచేవారు. క్షేత్రస్థాయిలో ఫొటోలు తీసి, అధికారులకు పంపాల్సి ఉండేది. ఉన్నతాధికారుల పర్యవేక్షణకూడా ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు చలివేంద్రాల నిర్వాహణ గాలికొదిలేశారు. పట్టణంలో దాతల సాయంతో కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలు నిర్వహణ లేక దిష్టి బొమ్మల్లా దర్శనం ఇస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ చలివేంద్రాల జాడ కనిపించడంలేదు. కార్యాలయాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అవగాహన ఏదీ?

వడదెబ్బ తగలకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు అంతంతమాత్రంగానే ఉంది. ఉన్నతాధికారులు చాంబర్‌నుంచి కదలకుండా ప్రోగ్రామ్ అధికారులను పిలిపించుకోవడం, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో వైద్యా.దికారుల చర్యలు శూన్యం.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి: బెనర్జీ



రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ప్రజలు ఎండ వేడిమికి భరించలేక దాహార్తి తీర్చుకోవడానికి చూస్తే ఎక్కడ చలివేంద్రాల జాడలేదు. కనీసం ప్రభుత్వ కార్యాలయా వద్ద అయినా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుటుంది.

చలివేంద్రం ఏర్పాటు

ధర్మవరం, ఏప్రిల్ 9 : ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికే దాతల సహకారంతో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు డీఎం సత్యనారాయణరావు తెలిపారు. యువర్స్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాత నాగరాజు సహకారంతో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మంగళవారం చలివేంద్రాన్ని బాలుడిచేత ప్రారంబించారు. యువర్స్‌ఫౌండేషన్ ప్రెసిడెంట్ శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం, సభ్యులు చాంద్‌బాషా, బాబు, మల్లికార్జునపాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలుడు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ ఆధ్వర్యంలో..

బుక్కపట్నం, ఏప్రిల్ 9: ఎండలు మండిపోతున్న సందర్భంగా మంగళవారం మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ జయరాం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహం తీర్చడమే ధ్యేయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, వెంకటనారాయణరెడ్డి, జయ రాం, తెలుగుయువత వాల్మీకి విజయ్, సతీష్‌రాయల్, రమణరాయల్, బుచ్చగారిపల్లి చంద్ర పాల్గొన్నారు.

కందికుంటకు తొగటవీర క్షత్రియుల మద్దతు



కందికుంటను కలిసిన తొగటవీర క్షత్రియులు

నంబులపూలకుంట, ఏప్రిల్ 9: మండలంలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన తొగటవీర క్షత్రీయులు కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను మద్దతు తెలిపారు. మంగళవారం కదిరిలోని కందికుంట నివాసానికెళ్లి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎల్లప్పుడూ పేదల తరపున నిలిచే కందికుంటను గెలిస్తేనే బడుగుల అభివృద్ధి సాధ్య మన్నారు. కందికుంటను కలిసిన వారిలో కడికట్ల లింగయ్య, ఆదినారాయణ, చిన్నరెడ్డెప్ప, పల్లా రామమోహన్ తదితరులు ఉన్నారు.

సూపర్‌సిక్స్‌పై విస్తృత ప్రచారం



కొండకమర్లలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 9: మండలంలోని కొండకమర్లలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు సూపర్ సిక్స్‌పై విసృత్త ప్రచారంచేశారు. మంగళవారం 172, 173 బూతుల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే చేపట్టనున్న పథకాలపై ప్రజలకు వివరించారు. కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొగాకు షఫీ అహమ్మద్, ఆర్‌ఎంపీ జాకీర్, ఐటీడీపీ పొగాకు షానవాజ్, బాలక్రిష్టారెడ్డి, బషీర్, బుక్కపట్నం బాషా, సలాం, బాబుఖాన్, గండికోట ఇర్షాద్ తదితరులున్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో కవులకు సన్మానం

కొత్తచెరువు, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా కవులను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం రాత్రి స్థానిక వాసవీ కల్యాణమండపంలో కవులు ఇషాక్, కొండసాని రజితకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను రిటైర్డ్ ఉప విద్యాధికారి మునయ్య చేతులమీదుగా సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు సుధాకర్ చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరా చంద్రబాబునాయుడు, కార్యదర్శి సురేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ఉపాధ్యాయులు జనార్దన్, సుధాకర్, చంద్రశేఖర్, బాబు, మాధవీలత పాల్గొన్నారు.



కవులను సన్మానిస్తున్న ఆపస్ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్న సవిత



గాయపడ్డ వారిని వాహనంలోకి ఎక్కిస్తున్న సవిత తదితరులు

రొద్దం, ఏప్రిల్ 9 : మండలపరిధిలోని ఆర్ మరువపల్లి నమాజుకట్ట మలుపువద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కుర్లపల్లికి చెందిన దినేష్, కర్ణాటకలోని కొడుమడుగు గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్రవాహనంపై కొడుమడుగు నుంచి కుర్లపల్లికి వస్తున్నారు. మార్గమధ్యలో ఆర్ మరువపల్లి నమాజుకట్ట మలుపువద్ద వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. దినేష్‌కు స్వల్పగాయాలుకాగా నరసింహులు తలకు, మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో పెనుకొండ వైపు నుంచి రెడ్డిపల్లి వైపు వెళ్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వారిని గమనించారు. హుటాహుటిన తన వాహనంలో రొద్దం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించి మానవత్వం చాటుకున్నారు. అలాగే 108 వాహనం కోసం ఫోన్ చేసి త్వరగా వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఆ వాహనంలో వారిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. సాయం అందించిన వారిలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, ఎం కొత్తపల్లి ఈరన్న తదితరులు ఉన్నారు.

మరో ప్రమాదంలో ఇద్దరికి...

రొద్దం, ఏప్రిల్ 9: పరిగి మండలం మసాలా ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలపరిధిలోని కలిపి గ్రామానికి చెందిన షర్ఫుద్దీన్ హిందూపురం వెళ్లి తిరిగి వస్తున్నాడు. అలాగే మరో వ్యక్తి పరిగి మండలం పైడేటి గ్రామం నుంచి హిందూపురం వెళ్తున్నాడు. ఈ రెండు ద్విచక్రవాహనాలు పరిగి మండలంలోని మసాలా ఫ్యాక్టరీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షర్ఫుద్దీన్‌కు కాలు విరగ్గా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని 108లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి స్థానికులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరిగి పోలీసులు తెలిపారు.

పేకాట ఆడుతున్న 15 మంది అరెస్ట్

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 9: మండలంలోని మంగాపురంలో మంగళవారం పేకాడుతున్న 15మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. గ్రామంలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.70వేలు నగదు, ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే పేకాడుతున్న వారి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు రూ.2లక్షలకుపైగా లెక్కించి పోలీసులు తీసుకెళ్లినట్లు సమాచారం. పట్టుబడినవారిలో ఓ వైసీపీ కౌన్సిలర్ ఉన్నట్లు సమాచారం.

కదిరిఅర్బన్: మండలపరిధిలోని కౌలేపల్లి వద్ద పేకాడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు రూ రల్ సీఐ మోహన్ మంగళవారం తెలిపారు. అందిన సమాచారంతో దాడులు చేసి రూ.4000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

నల్లచెరువు, ఏప్రిల్ 9: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్ఐ కేఎం. లింగన్న తెలిపారు. స్థానిక కదిరి, మదనపల్లి రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా తనకల్లు నుంచి వచ్చిన నల్లరంగు కలిగిన స్కార్పియోలో 80 హైవార్డ్స్ విస్కీ 90 ఎంఎల్, ఓల్డుఅడ్మిరల్ మూడు ఫుల్ బాటిల్స్ సీజ్ చేశామన్నారు.

రైల్వే బ్రిడ్జిని ఢీకొన్న లారీ

ఒకరి మృతి, మరొకరికి గాయాలు



లారీ డ్రైవర్ అఫ్సర్ మృతదేహం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 9 : నియోజకవర్గ కేంద్రమైన పెనుకొండ సమీపంలోని మడకశిర వెళ్లే రహదారిలో మంగళవారం తెల్లవారుజామున రైల్వే బ్రిడ్జిని లారీ ఢీకొన్న ప్రమాదంలో అఫ్సర్(38) అనే వ్యక్తి అక్కడి కక్కడే మృతిచెందాడు. క్లీనర్‌కు తీవ్రగాయాలైనట్లు హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. కర్ణాటకలోని రాంనగర్ జిల్లా చిన్నపట్నం గ్రామానికి చెందిన డ్రైవర్ అఫ్సర్, క్లీనర్ పర్వాన్ తుమకూరు నుంచి టెంకాయల లోడ్‌తో లారీలో బయలుదేరారు. పెనుకొండ సమీపం వద్దకు రాగానే మంగళవారం తెల్లవారుజామున వాహనం అదుపుతప్పి మడకశిర రహదారిలో రైల్వేబ్రిడ్జిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అఫ్సర్ అక్కడికక్కడే మృతి చెందగా క్లీనర్ పర్వాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్లీనర్ పర్వాన్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రైల్వే బ్రిడ్జిని ఢీకొన్న లారీ

రంజాన్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి : సీఐ

పావగడ, ఏప్రిల్ 9: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సురేష్ సూచించారు. ఆయన ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలు, ముతవల్లీలు, మత పెద్దలు పండుగ వేడుకల సందర్భంగా ఎటువంటి వత్తిళ్లకు లోను కాకూడదని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సంప్రదాయ బద్ధంగా శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీపాండురంగ స్వామి



పురంలో చందనపు చీర అలంకారంలో వాసవీమాత





కోనాపురంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
ప్రత్యేక అలంకరణలో వినాయకుడు





మడకశిరలో అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి, విశేష పూజలు అందుకొంటున్న మిట్టబండ ఆంజనేయస్వామి

ఘనంగా ఉగాది వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

తెలుగు సంవత్సరాదిని హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు ఉగాది శోభ సంతరించుకున్నాయి. అర్చకులు ఉదయం నుంచి ఆయా దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు పంచాంగ శ్రవణం చేసి, రాశి ఫలాలు వివరించారు. ముద్దిరెడ్డిపల్లిలోని తొగటవీర క్షత్రియుల ఆరాధ్యదైవం చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. బంగారు చీరతో అమ్మవారు కనువిందు చేశారు. అమ్మవారికి మంగళవారం అర్ధరాత్రి తరువాత పూజలు చేసి దీపాలు మోసి మొక్కులు చెల్లిస్తారు. అదే విధంగా ప్రసిద్ధ పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామిని, రుక్మిణి, పాండురంగనాథస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. మడకశిర పట్టణంలోని



అలంకరణలో ముద్దిరెడ్డిపల్లి చౌడేశ్వరీమాత

చంద్రమౌళేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి, భోగరామలింగేశ్వరస్వామి, అయ్యప్పస్వామి తదితర దేవాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పచ్చని తోరణాలతో ఆలయాలన్నీ కళకళలాడాయి. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఉగాది పచ్చడి పంచిపెట్టారు. ఉగాది పండుగను పురస్కరించుకుని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన నీలకంఠాపురంలోని దేవాలయాలు ఉదయం వెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో వేదపండితులు నిర్వహించిన పంచాంగ శ్రవణంలో రఘువీరారెడ్డి దంపతులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే కర్ణాటకలోని పావగడ తాలూకాలో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. అలాగే మండలకేంద్రమైన సోమందేపల్లిలో వెలసిన బైలాంజనేయస్వామి ఆలయం వద్ద ఎడ్లబండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో రైతులు ఎడ్లబండ్ల ఊరేగింపు చేపట్టారు. మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామికి జ్యోతులు సమర్పించారు.





అలంకరణలో బైలాంజనేయస్వామి, ఎద్దులబండ్ల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



పెనుకొండలో పంచాంగం పఠిస్తున్న వేద బ్రహ్మ నాగప్రసాద్‌శర్మ



మడకశిరలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న రఘువీరారెడ్డి దంపతులు

14న 'బాబు కోసం మేము సైతం'

విజయవంతం చేయండి : టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 9: బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో 'బాబు కోసం మేము సైతం' కార్యక్రమాన్ని ఈనెల 14వతేదీన బెంగళూరులో ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన మంగళవారం అమరాపు రం, రొళ్ల మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో బెంగళూరు నుంచి ఉగాది కోసం వచ్చిన పలువురు యువతను కలిశారు. బాబు కోసం మేము సైతం అనే కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని బెంగళూరులో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వారికి వివరించారు. బెంగళూరులోని బగలగుంట ప్రాంతంలో ఉన్న శ్రీసాయి కల్యాణ మండపంలో 14న ఉదయం 10 గంటలకు బగలగుంట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాయుడు, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథితోపాటు పలువురు జిల్లానేతలు సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సునీల్ కోరారు.



ఎం రాయాపురం గ్రామంలో యువతతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

సమాజానికి ఉపయోగపడేలా కవితలు రాయాలి

కవి సమ్మేళనంలో కవుల అభిప్రాయం



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న సడ్లపల్లి చిదంబరరెడ్డి

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 9: సమాజానికి ఉపయోగపడేలా కవులు, కవితలు ఉండాలని కవి సడ్లపల్లి చిదంబరరెడ్డి పేర్కొన్నారు. ఉగా ది పర్వదినాన్ని పుస్కరించుకొని స్థానిక అల్‌హిలాల్ పాఠశాలలో మంగళ వారం సాయంత్రం కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిదంబరరెడ్డి మాట్లాడుతూ... కవితలు సభ్యసమాజానికి ఉపయోగ పడేవి గా ఉండాలన్నారు. మారుతున్న కాలాన్ని అనుగుణంగా రాయాలన్నారు. వ్యవసాయం, రైతుల సాధక బాధకాలు, పేదల బతుకులు తదితర విషయాలతో ప్రజలకు మేలు జరిగేలా రచించాలన్నారు. ఈ సందర్భంగా ఉగాదిపై పాట, ప్రతిదినం పండుగే, నవ వసంతం, ఉగాది ఉషస్సు, ఉగాది కవిత, ప్రకృతి సోయగం- ప్రమాదపు టంచులో ప్రజాస్వామ్యం తదితర కవితలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎంఈఓ గంగప్ప, కవి శౌంతి జయప్రకాష్, ఉదయ్ కిరణ్, కల్లూరి రాఘవేంద్ర రావు, అశ్వత్థనారాయణ, డాక్టర్ ఈటీ రామ్మూర్తి, జేవీవీ నాయకు డు రామకృష్ణ, రైతు సంఘ నాయకుడు ధనాపురం వెంకట రామిరెడ్డి, ఓబులేశు, కొడిగేపల్లి సూర్యనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ పెన్నయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వ్యూహాలను తిప్పికొడదాం: టీడీపీ

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 9 : అధికార పార్టీ ఎన్నికల వ్యూహాలను తిప్పికొడదామని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత కోరారు. ఆమె మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండలస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే అధికార పార్టీ వైసీపీ నాయకులు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను వైసీపీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని, అయినా అధిక శాతం ప్రజలు టీడీపీ వైపే మొగ్గు చూపుతున్నారని తెలిపారు. సవిత మాట్లాడుతూ... వైసీపీ అవినీతి వ్యూహాలను తిప్పికొట్టాలని ఈసారి జరిగే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయానికి ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్య క్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నవెంకటరాముడు, నాయకులు కేశవయ్య, శ్రీనివాసులు, బాబుల్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, రఘువీరచౌదరి, రామక్రిష్ణారెడ్డి, షౌకత్, వడ్డె గోవిందు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సవిత, టీడీపీ నాయకులు

బైరాగి స్వామికి ప్రత్యేక పూజలు

తనకల్లు, ఏప్రిల్ 9: మండలంలోని కనసానివారిపల్లి సమీపంలో బైరాగి గుట్టవద్ద వెలసిన బైరాగిస్వామి ఆలయంలో లోకాయుక్త న్యాయమూర్తి లక్ష్మణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా న్యాయమూర్తి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తాము ఆలయాన్ని నిర్మించుకున్నామని, ఇది ప్రభుత్వ భూమి అయినప్పటికి ఆలయానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పం దించిన న్యాయమూర్తి రెవెన్యూ అధికారులతో చర్చించి, న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు ఆల య కమిటీ సభ్యులు క్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు బాగేపల్లి చలపతి, అన్నమయ్య జిల్లా కురాలపల్లికి చెందిన సిద్ధార్థ, పలువురు భక్తులున్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న లోకాయుక్త న్యాయమూర్తి లక్ష్మణరెడ్డి

కన్నుల పండువగా నెట్టికంటి గ్రామోత్సవం

గుంతకల్లు, ఏప్రిల్9: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి దేవస్థానంలో స్వామివార్ల గ్రామోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు సుప్రభాతసేవ, మహాభిషేకం, స్వర్ణకవచాలంకరణ, పుష్పాలంకరణ, ప్రాతఃకాల అర్చన, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుందరకాండ, వేద పారాయణాలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం పంచాంగ శ్రవణం అనంతరం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గరుడ వాహనంపై ఆశీనులను గావించి, అలంకారాలు చేశారు. ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.



కసాపురం ఆలయం ఎదుట
సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రైతుల ఖాతాల్లోకి చేరని ఇన్‌పుట్ సబ్సిడీ

- ❖ ముఖ్యమంత్రి బటన్ నొక్కి నెల దాటినా పడని డబ్బు
- ❖ బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ



ఖరీఫ్‌లో దెబ్బతిన్న వేరుశనగ పంటను చూపుతున్న రైతు (ఫైల్)

మడకశిర, ఏప్రిల్9: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిని రైతులు బాగా నష్టపోయారు. పంట నష్ట పోయిన రైతులకు అందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి గత నెల 6న ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి సొమ్ము విడుదల చేసినా నేటికీ చాలామంది రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చి ఖరీఫ్‌లో పంటలు సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టం వాటిల్లింది. అలాగే రబీలో సాగు చేసిన పంట లు కూడా దెబ్బతిని నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసినప్పటి నుంచి వర్షాలు కురవక పోవడంతో 90శాతం పైబడి పంటలు దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీరణం 3.23 లక్షల హెక్టార్లు. ఇందులో రాగి, వేరుశనగ, మొక్క జొన్న, పత్తి తదితర పంటలు సాగుచేస్తారు. గతేడాది పంటలు సాగు చేసిన ప్పటి నుంచి వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతిని పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగిరాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట కేంద్ర కరువు బృందం జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. పంటలు దెబ్బతినడానికి కారణాలను బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి, జిల్లాలో 73,556 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వానికి కరువు బృందం నివేదికను పంపినట్లు స్థానిక అధికారుల సమాచారం. దీంతో జిల్లాలోని 1,17,005 మంది రైతులకు రూ.105.03 కోట్లు పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ముఖ్యమంత్రి జగన్ నెల కిందట బటన్ నొక్కి పంటనష్ట పరిహారం విడుదల చేశారు. అయితే నేటికీ తమ ఖాతాల్లోకి సొమ్ము జమకాలేదని రైతన్నలంటున్నారు.

రైతుల ప్రదక్షిణ

పంటనష్ట పరిహారం తమ ఖాతాల్లోకి జమ కాకపోవడంతో రైతులు బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మడకశిర నియోజకవర్గంలో ని ఐదుమండలాల్లో గత ఖరీఫ్‌లో 19,695 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల సమాచారం. దీంతో నియోజకవర్గంలోని 47,505 మంది రైతులకు రూ. 28.62లక్షలు పంటనష్ట పరిహారం మంజూరైంది. ముఖ్యమంత్రి బటన్ నొక్కి విడుదల చేసినా చాలామంది రైతుల ఖాతాల్లోకి జమకాలేదు. రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఆ సొమ్ము వస్తే ఈ యేడు ఖరీఫ్ సాగు చేసేందుకు ఉపయోగ పడుతుం దనుకుంటే నేటికీ తమ ఖాతాల్లోకి జమకాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఖాతాలలోకి ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయాలని కోరుతున్నారు.

మండలం	నష్టపోయిన రైతులు	దెబ్బతిన్న పంటలు (హెక్టార్లలో...)	ఇన్‌పుట్‌సబ్సిడీ మంజూరు (రూ.లక్షల్లో...)
అగళి	9023	3331.40	433.52
అమరాపురం	7066	3732.83	584.59
గుడిబండ	1184	4447.35	655.35
మడకశిర	9145	4069.60	575.61
రొళ్ల	10787	4114.01	613.27
	47505	19695.18	2862.32

నియోజకవర్గంలోని 47,505 మంది రైతులకు రూ.28.62 కోట్లు మంజూరైంది.

నేటికీ జమ కాలేదు



ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితుల కారణంగా పూర్తిగా దెబ్బతిని నష్టపోయాం. నాకున్న 4.36 ఎకరాలలో పంట దెబ్బతింది. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ. 40,000 వేలు మంజూరు చేసింది. ఈ యేడు మార్చి 6న ముఖ్యమంత్రి బటన్ నొక్కి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారు. ఇప్పటికి నెలదాటింది. అయినా నేటికి నా ఖాతాలోకి నగదు జమ కాలేదు. మంజూరు అయిన ఇన్‌పుట్ సబ్సిడీని త్వరగా ఖాతాలోకి జమచేస్తే మేలు.

- హనుమంతరాయప్ప, రైతు కెరకర, అగళి మండలం

బ్యాంకు, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం



గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుచేసినా. వర్షాభావం వల్ల పంట పూర్తిగా దెబ్బతిని నష్టపోయాం. దెబ్బతిన్న పంటకు ఇప్పుట్ సబ్సిడీ మంజూరైంది. అయితే ఇంతవరకు నా బ్యాంకు ఖాతాలోకి నగదు జమకాలేదు. ఎప్పుడు జమ అవుతుందో తెలుసుకునేందుకు బ్యాంకు, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. త్వరగా జమ చేస్తే ఈ ఖరీఫ్ పెట్టుబడులకైనా ఉపయోగపడుతుంది.

- నాగరాజు, రైతు, అగళి